'రిసనిప సరిపమ గమపా-

గమ పసనిప సరిపమ గమ పని సా!'

'ఔను!' అన్నాడు రామం. ఆమెని చూస్తూ ఆమెలోకిచూస్తూ, తల వూపుతూ.

—ని భార్య గతాన్ని గూర్చి చర్చించడం నాకిష్టంలేదు – అన్నాడు ఎమ్ డి. వాసవ ... బాగానే చెప్పాడు, తన మనసులో కోరిక—ఒక్క పౌర పాటు మాటకూడా రానివ్వకుండాను.

'రిసనిప్ప సానిపాప్ప గమపా-'

—మా వూరమ్మాయే ఇంతప్ప ట్నుంచి యెరుగుదును. ఆ రోజుల్లో ఎనభై రూపాయలు పెట్టి తంబురా కొనిచ్చాను !— అని తన అర్హతను ప్రతిష్ఠించాడు

'సారి సాన్ని సానిపాప్ప పానిపామ పామగామ-'

'కాలం' మారుతోంది... 'శభాష్!' అన్నాడు రామం.

సరస్వతి తల నిలువుగా ఆడించింది.

"రిసనిప్ప సానిపావ్ప పానిపామ పామ దాప్ప రిగమ రిగరి పామా"

—అందమే, టాలెంటే ఆమెకిశత్రువు లౌతాయని, ఆమె సౌందర్యం అడివి కాచిన వెన్నెల అయిపోతుందని భయ పడ్డానని-అంత సౌందర్యవతిని పొందిన తన అదృష్టాన్ని మెచ్చుకున్నట్టుగా ఆమె అందాన్నే మెచ్చుకున్నాడు.

'గామ పని ససనిప నినిపమ పప మగ మమగస—'

—అపవాదులు బయలుదేరేయని చెబుతూనే అవి ఎంత సమంజసమైనవో వివరిస్తూ; అమెని తనుకూడా కోర డంలో తప్పులేదని స్ఫురింపజేసేతు— కొత్త వుద్యోగాన్ని సాధించడానికి అత్యవసరమయ్యే అధికారిక గ్రంథాలను అడక్కుండానే యిచ్చి ఈప్రయత్నంలో తన సహకారం వుండగలదని సూచించేడు

"మొన్న రాజారావుగారు రాసిన పాటకి ఈ రాగంలో ఈ మనోధర్మం లోంచి ట్యూను కడదాం మేష్టారూ—"

'అలాగే—'

"ఆ సాహిత్యం కొంచెం కాపీ చేసివ్వరూ, ఆయన దస్తూరీ నాకు బోధ పడదు!"

"నేనది కాపీ చేస్తాను కాని; నువ్వు ఏమనుకోకుండా నాకొంచెం కాఫీ చేసిద్దూ; తల నొస్తుంది!"

"అయ్యో-! చెప్పేరు కాదేం?"

సరస్వతి చప్పున వేదిక దిగింది. బైండుపుస్తం, అందులో ఏర్పాటుగా పెట్టిన కాగితం, కలం, అతని కందించి వంటగదిలోకి వెళ్ళింది

మంచంమీద కూర్చునే, తలాపిన రెండుదిండ్లు పేర్చి; ఒళ్ళు విరుచుకుని, కలం పక్కనపెట్టి, కాగితం యెగిరి

అందించాడు. కళ్ళద్దాలు తియ్యగానే వోమాటు మొహం తుడుచుకోడం కనీసం అరచేత్తో నిమురుకోడం అల వాటు, రామానికి. తనకళ్ళూ, మొహమూ సరస్వతికేం చెప్పి పోతాయేమో అన్న భయం వున్నవాళ్ళాగ మొహంమీద తువ్వాల్ని వో నిమిషంపాటు నడిపాడు.

సరస్వతి నవ్వింది. లేచి, బట్టల స్టాండుదాకా వెళ్ళి, పాంటూ, షర్టూ తెచ్చి, మంచంపక్కని నిలబడి, 'లేవండి' అంది

చూశాడు

"వైజాగ్ వెళ్ళండి; ఇంకో గంటలో బస్సుంది."

"......"

"మీ మామగారు పెన్షన్ అమ్మిన డబ్బు నిన్న తీసుకు నుంటారు. అక్కయ్యగారు డబ్బు రేపు బ్యాంకులో వేసీకుండా ఆఖరు ప్రయత్నంచేసి అక్కడో, మరోచోటనో వో అయిదు వేలైనా తెచ్చుకోండి."

బట్టలందుకుని, లేవకండా అలామళ్ళీ చూశాడు లోతుగా.

సరస్వతి ట్రంకు పెట్టెలు పేర్చిన చోటికి వెళ్ళింది. పైనవున్న బ్రీఫ్‌కేసు తెరిచి, మరో జత బట్టలూ, కొన్నివస్తువులూ అందులో సర్దింది. "వాసవుడికి సంపదలూ, భోగాలూ అమృతమూ కూడా యిష్టమే, మిగిలిన ఆనందాలతో బాటు !... డబ్బుంటే యేమైనా కొనుక్కోవచ్చుగా!"

"పుచ్చుకుంటా డంటావా?"

"అక్కయ్యగారు మీకిస్తారా, యింత అవసరమైన సమయంలో, అన్నది మరింత గడ్డుప్రశ్నకదా, యిప్పుడు!"

"అదీ నిజమే"

"లేచి వెళ్ళండి."

"ఇంతా కష్టపడి తెచ్చేక అతను పుచ్చుకోనంటే?"

"పుచ్చుకుంటాడని మీకు తెలుసు; నాకే తెలుసు ! వెనక మీ కొలీగ్ నరసింహరావుకి హైద్రాబాదుకి ట్రాన్స్ఫరు కావాలంటేను, మీ స్టెనో రీటాకి కనఫర్మేషను కావాలంటేను మీరే యిప్పించేరుకదా!"

"అందరిదగ్గిరా పుచ్చుకుంటూనే వున్నాడనుకో ... మనదగ్గిర ఆత నాశించింది మరోటేమోననీ – డబ్బు పుచ్చుకోకపోతే ఏమౌతుందోననీ–"

"అతను మీదగ్గిర డబ్బు పుచ్చుకోక పోతే మీరు కె. అండ్ జె. కంపెనీలో బిజినెస్ మేనేజరుగా కొనసాగుతారు; వాసవగారు ఇక్కణ్ణుంచి తప్పుకునే వరకూనూ."

"అదే జావుంటుందంటావు?"

"అనే, నేననుకుంటున్నాను!" అంది సరస్వతి.

అప్పటికి అతను బట్టలు తొడిగేసుకుని తల దువ్వుకుంటున్నాడు.

సరస్వతి ట్రంకుపెట్టె తెరిచి అందులోంచి అతని పర్సుతీసి అందిస్తూ,

"వొకమాట అనుకున్నాం...మొగవారు మీరే తప్పలేదు, ఆమాటకి,నేనుమాత్రం యెందుకు తప్పాలి?" అంది, అతని కళ్ళలోకి చూడకండాను-

రామం ఆ మాటకి సంతోషించలేదు. కనీసం అలా అన్లేదు బ్రీఫ్‌కేసు తీసుకుని 'వస్తా' ననైనా చెప్పకుండా వెళ్ళేడు.

"కొన్ని పన్లు-

చెయ్యడం కన్నా-

చెప్పడమే కష్టమన్నమాట!..." అనుకుంది సరస్వతి.

* * *

సోమవారం ఉదయం తొమ్మిది కాకుండానే రామం యిల్లుచేరాడు.తలుపు వోరవాకిలిగా తెరిచివుంది. సరస్వతి మంచంమీదుంది. మూడురోజుల్నుంచీ నిద్రపోతున్నట్టు మొహం బాగా పొంగుంది.

'సరూ.'

"ఒచ్చేరా?"

"అరగంటయింది, వూళ్ళో దిగి. సరాసరి ఎమ్.డి. గారి బంగళా కెళ్ళేను అక్కడ పని అయిదునిమిషాల్లో అయి పోయింది. అయిదువేలూ ఇచ్చెయ్య బోయాను. రెండువేలే చాలన్నాడు. పనైపోయినట్టే," అంటూ మంచంమీద కూచుని ఆమెని తన శరీరంతో అభి నందించబోయాడు.

'ఆగండి' పేలవంగా నవ్వింది సరస్వతి. 'పాచిమొహం నేనూనూ!... స్నానం చేసొస్తాను......ఫ్లాస్కులో కాఫీ వుంచేను, తాగండి......ఇవాళేగా ఇంటర్‌వ్యూ?'

"ఏం యింటర్‌వ్యూ, నా మొహం! అంతా లక్ష్మీకటాక్షమేగా!"

"కాదులెండి. సరస్వతీ కటాక్షం కూడా లేకపోలేదు."

"లేదు. లక్ష్మి సమయానికి దబ్బి వ్వకపోతే యిదేదీ అవదు!"

"నే నన్నది అదికాదు. ఇంటర్వ్యూకి పిలిచిన ఆరుగుర్లో మిగతా అందరి కన్నా మీరే ఎక్కువ చదువుకున్న వారుకదా." అని, బాత్‌రూంవేపు కది లింది సరస్వతి.

'అదీ నిజమే అనుకో,' అంటూ రామం ఆమెవెంట నడిచాడు.

బాత్‌రూమ్‌లో దూరి తలుపు గడియ వేసింది సరస్వతి; అతన్ని అంత వెంటనే భరించలేక.

"మనిషికీ మనిషికీ మధ్య ఎన్ని తలుపులూ, ఎన్నిగోడలు!" అనుకుంటూ రెండు నిమిషాలు తలుపువొద్దనే నిలబడి తేనేగాని ఆమెకి బలం రాలేదు; స్నానం చెయ్యడానికి కూడానూ.